సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌గౌడ్

దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

కడియంకు బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి కుమార్‌గౌడ్ సవాల్

రఘునాథపల్లి ఫిబ్రవరి 13 : ఆడ లేక మద్దెల ఓడిందనే చందంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన అనుచరులు మాట్లాడుతున్నారని, దమ్ముధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి వై కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ సాధన కోసం ఎంతోమంది అమరులయ్యారని, వారి త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్య అధికార కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరి ఉద్యమం చేశారని, ఆ సమయంలో కడియం శ్రీహరి నువ్వు ఎక్కడున్నావని వారు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి బిడ్డను ఎంపీ చేసుకోవడానికి స్వార్థం కోసం తల్లిలాంటి గులాబీ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన కడియం రాజయ్యను విమర్శించడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో పతనం తప్పదని వారు హెచ్చరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ.800కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పు కోవడం మానుకోవాలని అన్నారు. కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలోనే నిధులు మంజూరు చేసిన పనులనే చేయిస్తూ కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ పార్టీని కానీ, ఎమ్మెల్యే రాజయ్యను కానీ విమర్శిస్తే సహించేది లేదని వారు అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్, జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ ముప్పట్ల విజయ్, నాయకులు ముక్క పరశురాములు, నూనె ముంతల యాకస్వామి, బండి కుమార్‌గౌడ్, బాబురావు, బాలరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 13 : రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్స్‌కు అందిస్తున్న వైద్య సేవలతోపాటు నిల్వ ఉన్న మందుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన, రుచి, శుచి కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో సీటీ స్కాన్, లిఫ్ట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల సదరం శిబిరాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ, డాక్టర్ కేశవనాథ్, డాక్టర్ అశోక్‌కుమార్, ఈఎన్‌టీ డాక్టర్ సృజన్‌కుమార్, సిబ్బంది ఖాజా పాషా పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన అర్చకులు

దేవరుప్పుల, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో ఉన్న అర్చక ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను గురువారం అర్చక ఉద్యోగ జేఏసీ కలిసి వినతిపత్రం సమర్పించినట్లు దేవరుప్పులలోని చండీ పరమేశ్వరి విజ్ఞాన పీఠాధిపతి, రాష్ట్ర ఆస్థాన పంచాంగకర్త సిద్ధాంతి అవసరాల ప్రసాదశర్మ తెలిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ ఐకాసా చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి దుండిగల ఆనంద్‌శర్మ ఉన్నారు.

పెంబర్తి గ్రామస్తులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్సీ కవితను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

హస్తకళలకు పెట్టింది పేరు పెంబర్తి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పెంబర్తి వద్ద ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- గ్రామంలో కలియ తిరుగుతూ.. అందరినీ ఆప్యాయంగా పలుకరించిన కవిత

జనగామ రూరల్, ఫిబ్రవరి 13 : పెంబర్తి అంటేనే హస్తకళలకు పెట్టింది పేరు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం జనగామ పర్యటనకు వచ్చిన ఆమెకు ఉమ్మడి జిల్లా ముఖద్వారమైన పెంబర్తి వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పెంబర్తిలో పర్యటించిన ఆమె ముందుగా అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపాన్న విగ్రహాలకు బీసీ నాయకులతోపాటు గౌడన్నలతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడన్నలు కవితను సన్మానించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న పెంబర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చినబోయిన నర్సయ్య కుమారుడు, బీఆర్‌ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ భర్త రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కలియతిరిగారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హస్తకళాకారుల సొసైటీలో పనిచేస్తున్న కార్మికులతో ముచ్చటించారు. వారి పనులను పరిశీలించారు. సమస్యలు తెలుసుకున్నారు. వారి చేసిన పనులను హస్తకళాకారులు కవితకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు గ్రామంలో ఆగడం లేదని కవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కవిత వెంటనే పర్మినెంట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి అన్ని బస్సులు నిలుపాలని ప్రభుత్వాన్ని కోరారు.

గణపతి విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పెంబర్తి హస్తకళలకు ప్రసిద్ధి చెందిందన్నారు. అనంతరం పక్కనే ఉన్న మమ్మాయమ్మ ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశం, జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు బాల్దె విజయ, సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ, మండల కార్యదర్శులు నిమ్మల స్వామి, ఎడ్ల శ్రీనివాస్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము రాజు, ప్రభాకర్, సందీప్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఎర్ర సుజాత, శానబోయిన శ్రీనివాస్, మూల రవి, కావ్యశ్రీ, రాజిరెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బొకే అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గురువారం జనగామలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవితకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు గ్రామాల్లోకి వెళ్తున్న నాయకులకు అండగా ఉండాలని కవితను కోరడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనీల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు కైసర్, జలెందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మామిడి అయిలయ్య పాల్గొన్నారు.

చంద్రుతండాలో పోలింగ్ బూతు ఏర్పాటు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని చంద్రుతండాలో నూతనంగా పోలింగ్ బూతు ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 02.08.2018లో మాన్‌సింగ్‌తండాను కలుపుకుని చంద్రుతండా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడినట్లు తెలిపారు. ఈ రెండు తండాలకు చెందిన ఓటర్లు విశ్వనాథపురం, తానేధార్‌పల్లి గ్రామాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేవారు. దీంతో తాము వేరే గ్రామాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామని, చంద్రుతండాలో పోలింగ్ బూతు ఏర్పాటు చేయాలని తనతోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె పృథ్వీ అధికారులను అభ్యర్థించినట్లు గణేశ్ తెలిపారు. స్పందించిన అధికారులు చంద్రుతండాలో పోలింగ్ బూతు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాధారణ వసూళ్లలో భాగంగా వెళ్లినం..

బాధితుడే గేటు ట్రాక్టర్‌లో వేసిండు : డీసీసీబీ మేనేజర్

కొడకండ్ల, ఫిబ్రవరి 13 : సాధారణ వసూళ్లలో భాగంగా మొండి బకాయిల కింద గ్రామాలకు, ఇంటికి వెళ్లి వసూలు చేస్తున్నం తప్ప ఎలాంటి జప్తు చేయాలనే ఆలోచన లేదని కొడకండ్ల డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ నాతి కల్యాణి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంకులో లోను కట్టలేదని ట్రాక్టర్‌లో గేటు తీసుకెళ్లిన విషయమై ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏడునూతులకు చెందిన బాధితుడు నర్సయ్య, బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ కల్యాణి మాట్లాడుతూ 2021లో నర్సయ్య భార్య ప్రేమలత లోనుగా గేదెను తీసుకున్నదని, ఆ లోను 2023లోనే పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు కాలేదన్నారు. 3నోటీసులు పంపినా లబ్ధిదారురాలు నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. దీంతో బుధవారం గ్రామంలోకి వెళ్లినట్లు తెలిపారు. కాగా, ఆ గేదెను ప్రేమలత నుంచి మరో వ్యక్తి తీసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తి వీరికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు మేనేజర్ తెలిపారు. ఈ క్రమంలో లోన్ రికవరీకి గ్రామానికి వెళ్లగా లబ్ధిదారురాలు భర్త నర్సయ్య బ్యాంకు వాళ్లు తమ ఇంటికి వస్తున్నారనే విషయం గేదె తీసుకున్న మరోవ్యక్తికి తెలియాలనే ఉద్దేశంతోనే తన గేటును ట్రాక్టర్‌లో వేసినట్లు మేనేజర్ వివరణ ఇచ్చారు.

హరిత వృక్షార్చన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళా మాజీ ప్రజాప్రతినిధులు

జనగామ, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : ఈనెల 17న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టనున్న వృక్షార్చన వాల్ పోస్టర్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణలో స్థానిక బీఆర్‌ఎస్ మహిళా నాయకులతో కలిసి హరితసేన జనగామ ఇన్‌చార్జి దూసరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, అపర భగీరథుడు, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 17న తెలంగాణ రాష్ట్రంలో హరితసేన ఆధ్వర్యంలో వృక్షార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గులాబీ సైనికులు, కేసీఆర్ అభిమానులు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి తెలంగాణను హరితవనంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు పోకల జమున, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు సుధా, శారద, స్వరూప, కమలమ్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలం

డైరీ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు పాలడుగు భాస్కర్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 13 : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, పేదలు, సామాన్యులకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం జనగామ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడుతూ దేశంలో ఉన్న 58కోట్ల మంది కార్మికులకు దేశ సంపద రూ.50లక్షల కోట్ల నుంచి కేవలం రూ.3600 కోట్లు మాత్రమే బీజేపీ ప్రభుత్వం కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ఒక్కో కార్మికుడికి రూ.109 మాత్రమే వస్తాయని, దీంతో దేశంలోని కార్మికులను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఉద్ధరిస్తుందనేది అర్థమవుతున్నదన్నారు. పన్నులు పెంచి ఆదాయం సమకూర్చుకోవడం సరైన పద్ధతి కాదని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ పథకాలకు బడ్జెట్ పెంచకుండా ఆశించిన ఫలితాలు ఎలా సాధిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, కోశాధికారి వంగూరు రాములు, సభ్యులు యాటల సోమన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాపర్తి రాజు, సుంచు విజేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీ ప్రకాశ్, తాండ్ర ఆనందం, రాజు, మల్లేశ్, అంజయ్య, సంపత్‌కుమార్, బాబు, దయాసాగర్, శంకర్, సోమేశ్, భిక్షపతి, కనకయ్య, అనిల్, శ్రీనివాస్, యాదగిరి, ఎల్లస్వామి, లింగస్వామి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో

పాలకుర్తి, ఫిబ్రవరి 13 : ఈ నెల 15వ తేదీన గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులతో సేవాలాల్ జయంతి ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ రాజకీయాలకతీతంగా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జయంతి ఉత్సవాల దగ్గర ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. బోగ్ బండారో కార్యక్రమాన్ని ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అన్ని రాజకీయ పార్టీల నాయకులు పార్టీల జెండాలను ఏర్పాటు చేయరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పీ శ్రీనివాస్, చంద్రమోహన్, శ్రీనివాస్, డీటీ వేణుగోపాల్, ఆర్‌ఐ రాకేశ్, ధరావత్ సురేశ్‌నాయక్, రాజేశ్‌నాయక్., గిరిజనులు లావుడ్యా భాస్కర్, బానోత్ మహేందర్, లకావత్ వెంకట్, లకావత్ సురేశ్, బీ మల్లేశ్, ధరావత్ రవి పాల్గొన్నారు.

స్త్రీనిధిలో లక్షల్లో అవినీతి

- అసిస్టెంట్ మేనేజర్ స్వప్నపై కేసు
- దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు

దేవరుప్పుల, ఫిబ్రవరి 13 : మండలంలోని ఐకేపీ పరిధిలోని స్త్రీనిధి నిధుల్లో గోల్‌మాల్ జరిగింది. లక్షల్లో అవినీతి జరిగినట్టు తేలడంతో దేవరుప్పుల మండలానికి ఇన్‌చార్జిగా పనిచేసిన స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ తిప్పారపు స్వప్నపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అధికారుల విచారణ అనంతరం జనగామ జిల్లా స్త్రీనిధి ఆర్‌ఎం పాలాది నిర్మల దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో అవినీతికి పాల్పడ్డ స్వప్నపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దీనికి తోడు మండలంలో మోసానికి గురైన మహిళా సంఘాలు స్వప్నపై మరో ఫిర్యాదు చేసినట్టు ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి తెలిపారు.

రూ.21లక్షల అవినీతి..

2021-22 ఆర్థిక సంవత్సరంలో ధర్మాపురానికి చెందిన రాములమ్మ గ్రామైఖ్య సంఘంలో రూ.6లక్షలు, సీతారాంపురం దీప్తి, ప్రగతి, తిరుమల గ్రామైఖ్య సంఘాల్లో మరో రూ.11 లక్షలు స్త్రీనిధి నిధుల్లో అవినీతి జరిగిట్టు అధికారుల విచారణలో వెల్లడైందని ఏపీఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. మరోవైపు ధర్మగడ్డ తండాలో 13గ్రామైఖ్య సంఘాల్లో 40మంది మహిళలకు చెప్పాపెట్టకుండా రూ.24లక్షలు వారివారి ఖాతాల్లో జమచేయగా, బ్యాంకర్లు వారు బాకీ ఉన్న పాత లోన్ల కింద జమచేయడంతో స్త్రీనిధి రుణాలు తమకు అందలేదని ఆయా స్త్రీనిధి రుణ గ్రహీతలు రుణం చెల్లించేదిలేదని తేటతెల్లం చేస్తున్నారు. ధర్మాపురం, సీతారాంపురం గ్రామాల్లో రుణం తీసుకున్న మహిళలు తాము తిరిగి చెల్లించామని, ఇవి బ్యాంకులో జమ కాలేదని మొత్తుకుంటున్నారు. కాగా మహిళల నుంచి రుణాలు వసూలు చేసిన వీవోఏలు అసిస్టెంట్ మేనేజర్ స్వప్న ఆదేశాల మేర వసూలు చేసిన డబ్బులు నేరుగా స్వప్న ఖాతాలో జమ చేసినట్టు అధికారులు తెలిపారు. ఇలా ఈ స్త్రీనిధి వసూళ్లను తన సొంతానికి ఏఎం స్వప్న వాడుకుందని వారన్నారు.

వాడుకున్న డబ్బులు కట్టడం లేదు..
స్త్రీనిధి ఆర్‌ఎం నిర్మల

స్త్రీనిధి నిధుల్లో అవినీతి జరిగినట్టు కలెక్టర్, డీఆర్డీవో దృష్టిలో ఉంది. ఈ విషయంలో అనేక సార్లు అసిస్టెంట్ మేనేజర్ స్వప్నను అడుగగా డబ్బులు చెల్లిస్తానని తెలిపింది. దేవరుప్పుల, లింగాలఘనపురం మండలాల్లో రూ.20లక్షల వరకు అవినీతి జరిగింది. కలెక్టర్ షేక్ రి జ్వాన్ బాషా ఆమె నుంచి రికవరీకి మూడు నెలలు టైం ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో అధికారుల ఆదేశాల మేర దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

ఎఫ్‌ఐఆర్ నమోదైంది..
ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో స్త్రీనిధి నిధుల్లో అవకతవకలు జరిగినట్టు దీనికి అసిస్టెంట్ మేనేజర్ తిప్పారపు స్వప్న కారణమంటూ స్త్రీనిధి జిల్లా ఆర్‌ఎం పాలాది నిర్మల ఫిర్యాదుతో స్వప్నపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. దీనిపై విచారణ జరుపుతున్నామని, ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆకేరువాగు వద్ద అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలిస్తున్న సీపీ

ఇసుక అక్రమ రవాణాపై 100కి సమాచారమివ్వాలి : సీపీ అంబర్‌కిశోర్‌ఝా

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 13 : గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా కట్టడికి 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. గురువారం మండలంలోని ఉప్పుగల్లు శివారు ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంటుందని, చెక్ పోస్టులు పెడతామన్నారు. ఆయన వెంట వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ కొమ్మూరి శ్రీనివాసరావు, జఫర్‌గఢ్ ఎస్సై రామ్‌చరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇసుక తరలింపుపై పోలీసుల ఉక్కుపాదం

రఘునాథపల్లి, ఫిబ్రవరి 13 : ఇసుక తరలింపుపై ఉక్కుపాదం మోపేందుకే వెంకటాయపాలెం టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు డీసీపీ మహేంద్రనాయక్ తెలిపారు. ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తరలిస్తే ఎంతటివారైనా శాఖాపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 13 : జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం సజావుగా కొనసాగినట్లు డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. 11వ రోజు జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 644మందికిగాను 577మంది హాజరుకాగా, 67 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ అండ్ ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 492మందికిగాను 469మంది హాజరుకాగా, 23మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను డీఐఈవో జితేందర్‌రెడ్డి సందర్శించగా, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ పరీక్ష కేంద్రాలను డీఈసీ మెంబర్లు శ్రీనివాస్, శేఖర్, జనగామ, కొడకండ్ల కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు.

రాజును పరామర్శిస్తున్న మండల డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

బీఆర్‌ఎస్ నాయకుడికి బండ ప్రకాశ్ పరామర్శ

జనగామ రూరల్, ఫిబ్రవరి 13 : మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చినబోయిన నర్సయ్య కుమారుడు, బీఆర్‌ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ భర్త రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ గురువారం రాజును ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూల రవి, అంబేద్కర్ సంఘం నాయకుడు ప్రేమ్‌సాగర్, బండ వెంకటేశం, శ్రీను, ప్రదీప్ పాల్గొన్నారు.

పీఎం పరేడ్ ర్యాలీలో విద్యార్థుల ప్రతిభ

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 13 : జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థులు ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన 'పీఎం ర్యాలీ' 'కర్తవ్యపథ్' పరేడ్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గురువారం కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో విద్యార్థులను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. వరంగల్ 10టీ బెటాలియన్ నుంచి మొత్తం ఆరుగురు విద్యార్థులను సౌత్ జోన్ నుంచి ఎంపిక చేయగా, అందులో ఇద్దరు విద్యార్థులు జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలకు చెందిన శ్రీకాంత్ (బీకామ్ తృతీయ) పీఎం ర్యాలీలో, అజయ్ (బీఎస్సీ తృతీయ) కర్తవ్యపథ్ పరేడ్‌లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి గిరిజనులకు ఆహ్వానం

దేవరుప్పుల, ఫిబ్రవరి13 : ఈ నెల 15న పాలకుర్తిలోని సేవాలాల్ మహరాజ్ భవన్‌లో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు మండలంలోని గిరిజనులంతా హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవం శనివారం ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల గిరిజనులకు ఆహ్వానం పలుకుతున్నామని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ బూతుల్లో సమస్యలపై సమావేశం

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి13 : మండలంలోని పోలింగ్ బూతులలో సమస్యలు, అవసరాలపై ఎంపీడీవో విజయశ్రీ గురువారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి సమస్యలు లేవని వివిధ పార్టీల నాయకులు తెలిపినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో 9 ఎంపీటీసీలకుగాను 17లొకేషన్లు, 56పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు. మండలంలోని 15 గ్రామాల్లో స్త్రీలు 13,353, పురుషులు 13,165 మొత్తం 26,518 ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో నర్సింగరావు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, జనసేన, బీఎస్పీ పార్టీల మండల అధ్యక్షులు మాచర్ల గణేశ్, గాదె పృథ్వీ, జూలుకుంట్ల శిరీశ్‌రెడ్డి, రమణగౌడ్, జలగం ప్రవీణ్, జీడి రమేశ్, రడపాక ప్రదీప్, గజ్జి దయాకర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ముగిసిన అంత్యక్రియలు

కొడకండ్ల, ఫిబ్రవరి 13 : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన ఎలికట్టె యాదగిరి (62) కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉండడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా ఈ నెల 9న మృతి చెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అదే రోజు ఇంటికి తీసుకువచ్చారు. కాగా, ఇంట్లో ఆస్తి తగాదా కారణంగా దహన సంస్కారాలు చేయకుండా పెద్ద కుమారుడు అడ్డుపడ్డాడు. నాలుగు రోజులుగా ఇంట్లోనే ఫ్రీజర్‌లో మృతదేహాన్ని ఉంచారు. ఎట్టకేలకు తల్లి ఎలికట్టె పద్మ పేరా ఉన్న ఎకరం20 గుంటల భూమిని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కుమారుడు ఎలికట్టె రమేశ్ పేరా రిజిస్ట్రేషన్ చేశారు. రమేశ్‌కు రావాల్సిన వాటా రావడంతో గురువారం అంత్యక్రియలు ముగిశాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

HOUSE FOR SALE
SepTeK
★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091
NTW-27793

CHANGE OF NAME
I, VALLEPU NAGARAJU S/o RAJAIAH, Age: 37Yrs, Occ: Driver, R/o H.No: 6-4/1, Vishwanatha Colony, Koppur Village, Bheemadevarapally Mdl, Hanumakonda Dist. My daughter name Changed from VALLEPU AMMULU D/o. VALLEPU NAGARAJU, to VALLEPU MEGHANA D/o. VALLEPU NAGARAJU,for all purposes.

CHANGE OF NAME
My Daughter GUNDE CHAMANTHY D/o. GUNDE BABU, R/o. H.No. 4-29, (V): Samudrala, (M): Ghanpur (Station), Dist: Jangaon-506252, T.G. Changed her name as GUNDE SRAVANTHI D/o. GUNDE BABU

CHANGE OF NAME
★I Danthalapelli Bikshapathi S/o Danthalapally Narayana resident of 9-8-38, Yellam Bazar, Warangal. H-No.: 9-8-38, -506002 Change my name from Danthalapally Bikshapathy to Danthalapelli Bikshapathi for all Purposes.
NTW-17483

WANTED
jobs Apply Now!
★ Wanted PRO's / Agents for MBBS, B.Tech Abroad Admissions. Contact Immediately Cell: 8121554649
NTW-326594

CHANGE OF NAME
★I PESARU MADHAVI (New Name) Previously called MAREPALLI MADHAVI (old name) changed my Surname to PESARU MADHAVI and R/o H.No 24-3-399/29, Amity Homes, Vishnupriya Colony, Hanamkonda-506001. T.S., Solemnly declare.
NTW-17484

GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565